క్లుప్తంగా

ఆలయంలో అక్షతలకు పూజలు



మరికల్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షతలను పెద్దచింతకుంటలో ఆదివారం గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా అక్షతలను ఊరేగించగా గ్రామస్తులు దర్శనం చేసుకున్నారు. అనంతరం వాటిని ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచారు. కార్యక్రమంలో ఆలయ పూజరి ప్రకాష్, విశ్వహిందు, బజరంగదళ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



ధన్వాడ: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థి సందీప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఆదివారం గురుకుల పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ నెల 26నుంచి 30 వరకు ఢిల్లీలో నిర్వహించే 67వ జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–19రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



మక్తల్: శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా ఆదివారం పట్టణంలోని కబడ్డీ పోటీలను డీవైఎస్‌ఓ వెంకటేష్ శెట్టి ప్రారంభించారు. రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీపోటీలను ప్రారంభించారు. కబడ్డీ పోటీలో 24టీంలు పాల్గొంటాయని, పోటీల్లో గెలుపొందిన వారికి 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు రాఘవేందర్, భీంరెడ్డి, అంబ్రేష్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు శ్రీ దత్తజయంతి

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సద్గురు అవదూత నర్సింహస్వామి దేవాలయంలో మంగళవారం దత్తజయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, మహాయజ్ఞం నిర్వహించి భక్తులకు అన్నదానం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని శ్రీదత్త ఆలయం వద్ద మంగళవారం శ్రీదత్త జయంతి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5.30గంటలకు సుప్రభాతం, 6గంటలకు కాగడహారతి, 6.45కు శ్రీవిఘ్నేశ్వర, శ్రీనందీశ్వర, శ్రీదత్తాత్రేయ, శ్రీసంతాన నాగదేవత, శ్రీజోతిర్లింగ, శ్రీరామ్‌పరివార్, శ్రీలక్ష్మీదేవి, శ్రీ షిర్డిసాయినాథులకు పంచామృతాభిషేకం, 9గంటలకు కావిడి ఉత్సవ, అర్చన, అష్టోత్తరం, 10.30గంటలకు శ్రీ దత్త యజ్ఞం, 12గంటలకు హారతి, సాయంత్రం ధూపహారతి, సాయిభజన, పల్లకీసేవ, సేజారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే వర్తక సంఘం అధ్యక్షుడు ఏపూరి యాదగిరిశెట్టి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గోశాలకు ఉచితంగా పశుగ్రాసం

నారాయణపేట రూరల్: పట్టణ శివారులోని పగిడిమారి రోడ్‌లోని గోశాలకు ఇటీవల పలువురు రైతులు ఉచితంగా పశుగ్రాసాన్ని అందిస్తున్నారు. మండలంలోని జిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బస్‌రెడ్డి, చింతల్‌రెడ్డి సోదరులు ఆదివారం తమ వ్యవసాయ పొలంలో వరిపంట కోత తర్వాత గడ్డిని గోశాలకు అందించేందుకు ప్రత్యేక ట్రాక్టర్లలో తరలించారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకోబ మాట్లాడుతూ... గత ఏడాది నుంచి దాదాపు వంద ఆవులతో గోశాల నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆవుల నుంచి మనం ఎంతో లాభ పడుతున్నామని, రైతులు పెద్ద మనస్సుతో గ్రాసాన్ని అందించి సేవా మార్గానికి జీవం పోయాలని కోరారు.



తగలబడుతున్న ప్రభుత్వ లక్ష్యం

- రోడ్లపైనే పంట వ్యర్థాలు తగలబెడుతున్న రైతులు
- కాలిపోతున్న హరితహారం మొక్కలు
- రైతులకు చెబుతున్న అధికారులు
- అయినా అదే తీరులో రైతులు



వర్కూర్ గ్రామ శివారులో తగలబడిన మొక్కలు

మాగనూర్: పర్యావరణ పరిరక్షణకోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం లక్ష్యం తగలబడిపోతుంది. ఒక వైపు భారీ సంఖ్యలో మొక్కలను నాటుతుంటే మరికొందరు చెట్లను నరకడం, తగలబెడట్టడం వంటి పనులతో ప్రభుత్వ లక్ష్యం నిర్వీర్యమవుతోంది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రోడ్డు పక్కన పంట వ్యర్థాలను తగుల బెట్టడంతో పక్కన ఉన్న చెట్లకు కూడా నిప్పుతగిలి చెట్లు కాలిపోతున్నాయి.

పంట వ్యర్థాలతోనే..

రోడ్లపై పంట దిగుబడులు ఆరబెట్టడం, నూర్పిళ్లు అక్కడనే చేయడంతో పంట దిగుబడుల వ్యర్థాలు అధికంగా వస్తున్నాయి. వాటిని కొందరు రోడ్డు పక్కనే తగుల బెడుతున్నారు. దీంతో సమీపంలో ఉండే చెట్లు తగులబడి పోతున్నాయి. మండలంలో మాగనూర్, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, కొత్తపల్లి, గురువలింగంపల్లి, తళంకేరి, వడ్వాట్, అడవి సత్యారం, కొల్పూర్, మందిపల్లి గ్రామాల్లో పలు రోడ్లపై పంట దిగుబడుల వ్యర్థాలను అలానే రోడ్డు పక్కన, రోడ్డుపై తగుల బెడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల మండల అధికారులు, ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను నాటారు. ప్రస్తుతం చెట్లు ఎదుగుతున్నాయి. వ్యర్థాలను తగులబెట్టే క్రమంలో ఆ చెట్లను కూడా తగుల బెడుతున్నారు. వ్యర్థాల నిప్పు సెగతో చెట్లు మాడి మసవుతున్నాయి.

ఎరువుగా తయారు చేసుకోవచ్చు..

పంట దిగుబడుల నుంచి వచ్చిన వ్యర్థాలను ఎరువులుగా తయారు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు అంటున్నారు. వ్యర్థాలను తగుల బెట్టకుండా పంటపొలాల్లో కందకం తవ్వి అందులో వేసి నీరు పడితే మంచి ఎరువుగా తయారవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

నోటీసులు జారీచేశాం..



రైతులు పంట వ్యర్థాలను రోడ్లపై, పంటపొలాలల్లో తగలబెట్టి హరితహారం మొక్కలను ధ్వంసం చేస్తున్నా అంశాన్ని గమనించాం. అయితే ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్‌ల ద్వారా వారికి చెబుతున్న మళ్లీ అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైతే మొక్కలకు నిప్పు పెడుతున్నారో మళ్లీ వారి ద్వారానే మొక్కలు నాటిస్తాం. గతంలో కూడా అలా చేసిన వారికి నోటీసులు జారీ చేశాం.

– శశికళ ఎంపీడీఓ, మాగనూర్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధితకుటుంబానికి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: మండంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి పూజారి ఆంజనేయులు ఇటీవల మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబానికి పరామర్శించి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చిన్న చిన్న విషయాలకు తొందరపాటుకు గురై విలువైన ప్రాణాలను క్షణికావేశంలో తీసుకోవద్దన్నారు. జీవితంతో పోల్చితే సమస్యలు చాలా చిన్నవని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, వేణు, వాకిటి శ్రీనివాసులు, దండు సత్యనారాయణ, వర్కూర్ ఆంజనేయులు, గడ్డం నరేష్, చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్నస్వామి పల్లకీ సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు



స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మక్తల్: శ్రీపడమటి ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఉత్తరాది మఠం నుంచి పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపుతో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకొచ్చారు. ఉదయం స్వామివారికి అంకుర్పార్పణ, ధ్వజారోహణం, అలంకారోత్సవం, గజవాహసేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు భజనలు, కోలాటం, భక్తికీర్తనలు ఆలపించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొన్నారు. స్థానిక చర్చిలో క్రైస్తవులను కలుసుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, అందరికి అందుబాటులో ఉంటు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతకుముందు క్రిస్మస్ కానుకలను అందించారు. గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అనంతరాములు ఇంటికి వెళ్లగావారు శాలువాతో సన్మానించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోట్ల రవిందర్‌రెడ్డి, రఘుబాబు, గోపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సిద్దప్ప, శివకుమార్, శరత్, నర్సింహులు, శ్రవణ్, భరత్ పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల వినతి

పీహెచ్‌సీ హెల్త్ సెంటర్లలో విధులు నిర్వహిస్తూ దశాబ్ద కాలంగా చాలీచాలని జీతంతో ప్రభుత్వానికి అండగా నిలుస్తున్న సెకండ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి ఆదివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కొండన్న, వెంకటేష్, సరస్వతి, పుష్పలత, రామేశ్వరీ పాల్గొన్నారు.

చర్చి అలంకరణ కోసం విరాళం



నర్వ: క్రైస్తవులకు అండగా ఉంటామని టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆదివారం రాత్రి ఆయనను కలిసిన క్రైస్తవులకు చర్చి అలంకరణ కోసం రూ. 10 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయనను క్రైస్తవులు, చర్చి ఫాదర్‌లు అభినందించారు. కార్యక్రమంలో డా.కృష్ణయ్య, క్రైస్తవులు ఏసు, శ్రీనివాసులు, కురుమూర్తి పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు నివేదికలు అందించని శాఖలు వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు.

ప్రజలకు సేవకుడిలా పనిచేస్తా

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ అంటే ప్రేమ, ఆప్యాయతకు ప్రతిరూపమని, ఇక్కడ అన్ని మతాల వారు త్రివేణి సంగమంలా కలిసిమెలిసి జీవిస్తారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో ఆదివారం ప్రభుత్వం తరపున నిరుపేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ, విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎంబీసీ చైర్మన్, పాస్టర్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే తదితరులు కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో బీఐ.జేకబ్, జేఐ.డేవిడ్, టీఏ.స్టిఫెన్, డానియల్ సుధీర్, కౌన్సిలర్ గోవిందు, వినోద్ కుమార్, దాసరి సుందర్, టైటస్ రాజేందర్, బండ సునీల్, దాసరి సామ్యేల్, కన్నా, సుజయ్, ప్రశాంత్, చిన్నరాజు, ప్రవీణ్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామంలో చంద్రప్ప స్వామి గృహంలో ఆదివారం భక్తులు అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం ,అష్టోత్తరం, అలంకరణ, పడిపూజను నిర్వహించారు. రాము గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం భక్తుల ను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిగురుస్వామి, శ్రీనివాసులు గురుస్వామి, భానుస్వామి గురుస్వామి, శంకర్, రఘువీర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

పేదరిక నిర్మూలనకు కృషి



మేడేపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



దేవరపల్లిలో..

ఆత్మకూర్: పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్‌అలీ అన్నారు. ఆదివారం మండలంలోని మేడేపల్లి, దేవరపల్లి గ్రామాల్లో వికాసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్‌యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్‌భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్‌ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా ఆధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాగ్యలక్ష్మి, శివాజీ, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



అమరచింతలో వేడుకలకు ముస్తాబైన చర్చి



ఆత్మకూర్‌లో



మూలమల్లలో..

నారాయణపేట రూరల్: క్రైస్తవ సోదరుల ముఖ్యమైన పండుగ క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. సోమవారం జరిగే పట్టణంలోని ఎంబీ చర్చితో పాటు మండలంలోని సింగారం, బైరంకొండ, కొల్లంపల్లి చర్చిలు అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్‌దీప అలంకరణలతో పాటు క్రిస్మస్ ట్రీని ఏర్పాటుచేశారు. అదేవిధంగా చర్చి చుట్టు పచ్చటి మొక్కలు, లోపల బొమ్మలతో అలంకరించారు. హైదరాబాద్, బొంబాయి, బెంగుళూర్ వంటి నగరాలకు వలస వెళ్లినవారు తిరిగి సొంత గ్రామానికి చేరుకోవడంతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానిక ఇస్మాయిల్ చర్చిలో ఫాస్టర్ ఆధ్వర్యంలో ఊరేగింపు, ప్రార్థనలు, క్రీస్తు బోధనలు, కేక్ కటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సంబంధిత చర్చి ఫాస్టర్ తెలిపారు.

ఆత్మకూర్: ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఉన్న చర్చిలను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రపంచ శాంతికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు సీజే జర్మియా, విద్యాసాగర్, డేవిడ్, శ్యాంసుందర్, సుమన్ తెలిపారు.

అమరచింత: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. క్రైస్తవులు తమ ఇళ్లపై వెలుతురు చూపే నక్షత్రపు విద్యుత్ దీపాలను అలంకరించి క్రీస్తు రాకను స్వాగతించారు. పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిలో పాస్టర్ హ్యాపీపాల్ ఆధ్వర్యంలో బోధనలు వినిపించారు.

నారుమళ్లపై మంచు ప్రభావం



చలిమంచు ప్రభావంతో పెరగని నారు

మరికల్: యాసంగి సాగుకోసం రైతులు వేసిన నారు మళ్లపై మంచుప్రభావం తీవ్రంగా ఉండటంతో నారు పెరుగుదల తగ్గింది. యాసంగిలో సాగుచేసే వరిపంటకు 25 రోజుల్లో నాట్లు వేయాల్సింది. అందుకు అనుగుణంగా నారుమళ్లు సిద్ధం కావాలి. కానీ ఆ పరిస్థితి కన్పించడం లేదు. గత పక్షం రోజుల నుంచి చలితీవ్రత పెరగడమే కాకుండా దట్టంగా మంచు కమ్మేయడంతో 25రోజులైన నారుమళ్ల పెరగడం లేదు. దీంతో రైతులు నారు పెరిగేందుకు చాలా రకాల పిచికారి మందులు వాడుతున్నారు. నారు పెరిగే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శ్రీశైలం తరలిన శివస్వాములు



శ్రీశైలం బయలుదేరుతున్న శివమాలాదారులు

నారాయణపేట రూరల్: కార్తీక మాసంలో మాల ధరించి మండలం (41)రోజుల పాటు నిష్ఠతో పూజలు చేసిన శివస్వాములు దీక్ష విరమణకు శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలివెళ్లారు. ఆదివారం మహంకాళి వీధిలోని శివాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగాష్టకం, బిల్వాష్టకం తదితర మంత్రాలు చదివి, భక్తి పాటలతో భజనలు చేశారు. అనంతరం గురుస్వాముల సమక్షంలో జంగమయ్య మంజునాథ స్వామి చేతులమీదుగా ఇరుముడి కట్టుకుని ప్రత్యేక నావలో బయలుదేరి వెళ్లారు. అంతకుముందు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అప్పిస్వామి, సంతోష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

అమరచింత: పాలమూర్‌లోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చంద్రశేఖర్ మెమోరియల్ తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అమరచింత విద్యార్థులు పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించారు. పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు జీవిత, భవ్య, అప్సపరిహ, అనిత, కవిత, శిరీష, లక్ష్మి ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపర్చారని కరాటే మాస్టర్ పి.నరేందర్ తెలిపారు. విద్యార్థినులకు గోల్డ్‌మెడల్‌తో పాటు సర్టిఫికెట్లను అందించారన్నారు. కరాటేలో ప్రతిభ కనపర్చి పట్టణ కీర్తిని దేశ నలుమూలల చాటాలని ఆకాంక్షించారు.

ఆత్మకూర్: న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడళ్లు సాధించారు. ఆదివారం వనపర్తిలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌హాల్లో జరిగిన చంద్రశేఖర్ మెమోరియల్ తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆత్మకూర్‌కు చెందిన శ్రీవిద్య, శ్రావణి, అరవింద్, గౌరీశంకర్, శశాంక్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటేమాస్టర్ పులి నరేందర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నారాయణపేట రూరల్: ధన్వాడ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వేర్వేరు కుటుంబాలకు చెందిన మహిళలు ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న అనురాధ (35), నర్సింగమ్మ (38) పురుగుల మందు సేవించగా, దీన్ని గమనించి వారి కుటుంబ సభ్యులు వెంటనే పేటజిల్లా ఆస్పత్రికి తరలించా రు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలను తెలుసుకుని వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్లకు పైగా పెండింగ్ ఉన్నాయని, విడుదల చేయకపోవడంతో పైచదువులకు వెళ్లేందుకు వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. భరత్, ఈశ్వర్, రాము పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: వనపర్తి జిల్లా బ్రాహ్మణ సంఘం లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూర్‌కు చెందిన న్యాయవాది దివాన్జీ అశోక్‌కుమార్‌రావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు వనపర్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు. బ్రాహ్మణులకు అన్ని విధాలుగా న్యాయం జరిగే విధంగా, సమస్యలు పరిష్కారం దిశగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఆయన అన్నారు.